# భర్తగారి సాధన

—టి.మీనాక్షి



**"మావారు తేరుకుని నా దగ్గరకు వచ్చారు. నాకోసం అయివుండదు లెండి. నేను చెప్పబోయే శుభవార్త కోసమే!"**

ప్రొద్దున్నే లేచి టైమ్ చూసేసరికి అరున్నర అవబోతోంది. కంగారుగా లేచాను ఆలస్యం అవుతోందని. కాని వెంటనే గుర్తువచ్చింది ఈరోజు 'కృష్ణాష్టమి' సెలవని. మళ్ళీ పడుకున్నాను. ఈరోజు ఆఫీస్ లేదంటే ప్రాణం హాయిగా ఉంది. లేకపోతే ఉరుకులు పరుగులు. కళ్ళు మూసుకున్నానో లేదో బెల్ మ్రోగింది. పాలవాడు వచ్చి ఉంటాడు. ఆ తరువాత పాలవాడు, పనమ్మాయి వెంటవెంటనే వస్తారు. చిన్నగా నిట్టూర్చాను. సెలవయినా పెందరాడే లేవలసిందే. అందులోను ఈరోజు ఆయనగారి పుట్టినరోజు. అంటే నాకెంతో ఇష్టమయిన రోజు. అందుకు గిఫ్ట్‌గా ఒక శుభవార్త ఈరోజు ఆయనికి చెప్పదలచుకున్నాను. ప్రక్కకు తిరిగి చూశా హాయిగా నిద్దరపోతున్నారు. లేపబుద్ధికాలేదు. కొంచెం సేపయిన తరువాత లేపుదామనుఉకున్నాను.

గంట తరువాత మా వారిని లేపడానికి వచ్చాను. కాని అంతకుముందే లేచినట్టున్నారు. ఎటోచూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు.

"గుడ్ మార్నింగ్ అండ్ హ్యాపీ బర్త్‌డే టూ యు" నవ్వుతూ చెప్పాను.

థాంక్స్ చెబుతారేమో అనుకున్నాను. చెప్పకపోగా బాధగా మొహం పెట్టారు.

"అదేమిటి అలా ఉన్నారు? ఏమయింది. విష్ చేస్తే కనీసం థాంక్స్ అయినా చెప్పరే" అడిగాను.

"ఎందుకు థాంక్స్. నేనెంత బాధగా ఉన్నానో తెలుసా? ముప్పై ఏళ్ళు వచ్చాయి ఏమీ సాధించలేదు ఏం లాభం?" అన్నారు.

వెంటనే నాకు ఆయన బాధ అర్థమయింది. మా వారిని ఎవరు ఏమన్నా బాధలేదు కానీ ఆయనకి ఆయన వయస్సు గుర్తుకు తెస్తేమటుకు ఎంతబాధో చెప్పలేను. అందుకే కొంచెం భయం వేసింది. ఇంక ఈ రోజంతా ఇంతేనేమో అని. అలా అయితే కనుక నిట్టూర్పులతోనే ఈ రోజంతా గడుస్తుంది.

ఒకసారి ఏమయిందంటే వాళ్ళ మేనత్తగారి అమ్మాయి వచ్చింది. చాలా చలాకీ అయిన అమ్మాయి. పేరు వాణి. ఏదో ఇంటర్వ్యూ కోసం వచ్చింది. ఏ విషయమయినా ఎంతో తేలికగా తీసుకునే మనస్తత్వం కలది. వచ్చిన రోజు రాత్రి ఏవో పేపర్లు సర్దుకుంటోంది. దానిలో 'బయోడెటా' కనబడింది.

"అదేమిటి వాణి అప్పడే నీకు 23 ఏళ్ళా?" చాలా ఆశ్చర్యంగా అడిగారు.

"అవును. ఏ, ఏమయింది?" అడిగింది వాణి.

"ఏమీ కాలేదు. అప్పడే నీకు అంత వయసా? అని" అన్నారు.

"అప్పడే ఏమిటి? వయసు ఏమన్నా వద్దు అంటే ఆగిపోయేదా! అందులో అంత ఆశ్చర్యపోయేది ఏముంది? నీకు మటుకు రాలేదు 30 ఏళ్ళు" అంటూ ఆగింది.

"దానికి ఆయనకి ఎంతో కోపం వచ్చింది. ఏమిటి నాకు 30 ఏళ్ళు వచ్చాయా?" చాలా ఆవేశంగా అడిగారు.

"ఏ ఇంకా రాలేదా పోనీలే ఇంకో సంవత్సరంలో వస్తుంది. దానికి ఇంత బాధ దేనికి" ఎంతో సింపుల్‌గా చెప్పింది.

"30 ఏళ్ళు రాకుండా వచ్చాయి అనడం తప్ప, పైగా అంత తేలికగా తీసిపారేస్తావా" ఈయనగారి గొంతులో ఆవేశం, బాధ.

"తప్పా ఇందులో తప్పేముంది. అయినా బావా! వయసుతో ఏమిటి చెప్ప, మనసు ఎప్పుడూ యవ్వనంగా ఉంచుకోవాలి. అస్తమానం వయస్సు వచ్చేస్తోంది. ముసలివాడినయిపోతున్నాను అని బాధపడకూడదు. మన ఆలోచనలు ఫ్రెష్‌గా ఉండాలి. అప్పడే మనము ఉత్సాహంగా ఉంటాము" అంటూ ఏదేదో చెప్పింది.

నిజంగా అప్పుడు ఆయన మొహం చూడాలి. మూతి ముడుచుకుని కోపంగా, బాధగా వింటున్నారు. అంత బాధ మావారికి వయస్సు అంటే. అలాంటిది ఇప్పుడు నిజంగా అంత వయస్సు వచ్చేసరికి బాధపడరూ మరి. ఇంక ఈరోజు ఎలా గడుస్తుందో?

"లతా కొంచెం కాఫీ ఇస్తావా?" మొహం కడు.



క్కుని వచ్చి పేపర్ తీసుకుంటూ అడిగారు. కాఫీ ఇచ్చి నా పనిలో పడ్డాను. పనిపిల్ల వెళ్ళిన తరువాత స్నానం కానించి, పూజ చేసుకుని వచ్చి చూసే సరికి ఏటో శూన్యంలోకి చూస్తూ దీర్ఘాలోచనలో ఉన్నట్టున్నారు.

"ఏమండోయ్ ఎక్కడ ఉన్నారు? స్నానం చేసి కొంచెం దేవుడి దగ్గర అగరుబత్తి వెలిగించండి. రోజూ ఎలాగూ కుదరదు. ఈ రోజయినా కనీసం పుట్టినరోజునాడయినా..." ఇంకా నా మాటలు పూర్తి అయ్యాయో లేదో పెద్ద నిట్టూర్పు వినిపించింది. భయంగా చూశాను.

ఆయనే మళ్ళీ గుర్తుకు వచ్చింది కాబోలు మెల్లగా గొణుక్కుంటున్నారు. "ఏం సాధించాను. వృధాగా గడిచాయి 30 ఏళ్ళు" అంటూ ఏదో బాధలో ఉన్నట్టు మొహం పెట్టారు.

నాకు కొంచెం విసుగు అనిపించింది. ఎందు కంటే లేచిన దగ్గర నుంచి ఇది రెండవసారి ఇలా అనుకోవడం. విసుగ్గా ఏమన్నా గట్టిగా అనాలిపించింది వద్దులే అనుకున్నా. అసలే తన వయసుని తలచుకుని కృంగిపోతున్నారు, నేను కూడా విసుక్కుంటే ఈ రోజంతా పాడయిపోతుందని తగ్గాను.

"కొంచెం కాఫీ ఇస్తావా స్నానానికి వెళతాను" ఎంతో ఇదిగా, బాధగా అడిగారు.

"ఏం సాధించారని మూడవసారి కాఫీ త్రాగడానికి" అడిగాను.

"అదేమిటి ఇది రోజూ ఉండేదేగా" ఎంతో ఆశ్చర్యంగా అడిగారు.

"మరి స్నానం రోజూ ఉండేదేగా. వారానికి రెండుసార్లు షాంపూ కూడా చేస్తారాయె! మరి ఈరోజు ఈ బాధ దేనికి". అడిగాను.

"నీకు అర్థంకాదు నా బాధ. కాఫీ తాగకపోతే ఇంకా ఎక్కువ అవుతుంది నా బాధ" అన్నారు గొంతులో బాధ, కంగారు ఒలకబోస్తూ.

నాకు మటుకు కాఫీ దొరకదేమో మూడవసారి అనే బాధ కనబడింది. నాకెందుకు వచ్చింది ఈయనతో కుర్చుంటే నా పని సాగదు అనుకుని కాఫీ ఇచ్చి "త్వరగా స్నానం చేయండి" అన్నాను.

వంట ప్రయత్నం మొదలుపెట్టాను. ఏం చేద్దామా అని ఆలోచించా. ఆయననే అడుగుదాం ఏం చేయమంటారో అని ముందుగదిలోకి వచ్చాను. టీవీ చూస్తున్నారు.

నేను రావడం చూసి "చూడు చూడు సచిన్ ఎలా ఆడుతున్నాడో, అజర్ ఎలా కాచ్‌లు పట్టుకుంటున్నాడో. సచిన్‌ని చూడు ఇంత చిన్నవయసులో ఎన్ని విజయాలు సాధించాడో" అని చెప్పకుంటూ వచ్చారు.

"సరేలెండి అది చూస్తూ కూర్చుంటే నా పని అవదు కానీ వంట ఏం చేయమంటారు? పుట్టిన రోజు కదా ఈరోజు" అన్నాను.

'ఏం సాధించానని పిండివంటలు చేయించుకుని..." ఇంకా ఏదో అనబోతుంటే నేను చటుక్కున అందుకున్నాను.

"అంటే నా ఉద్దేశం ఈరోజు శ్రీకృష్ణ భగవానుని పుట్టినరోజు కదా అని. సరేలెండి వంట ఏదో ఒకటి చేస్తాను" అని వచ్చేశాను. ఇంక అక్కడ ఉండదలుచుకోలేదు. అప్పుడు ఆయన చూపులు చూస్తే అర్థం అయివుండేది. ఆ చూపుల్లో నా కోసం కాదా అన్న ఇది ఉంది.

ఇంతలో ఫోన్ మ్రోగింది. తీసినట్టున్నారు. సంభాషణ అంతా వినబడుతోంది.

"హలో" "......." "థాంక్సరా"

"......."

"ఏముంది ప్రత్యేకత, ఏం సాధించానని....."

కాసెట్ ఆన్ చేశారు. అవతల వాళ్ళు ఎందుకు చేశారా భగవంతుడా అనుకోవాలి.

ఆ తరువాత వరుసగా రెండు మూడు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఈయన మామూలుగానే సేమ్ కేసెట్ ఆన్ చేశారు.

నాకు ఈరోజు పిచ్చి ఎక్కేట్లుంది ఈయనగారి ఈ ధోరణి చూస్తుంటే.

ఆయన కిష్టమని పొంగలి, పులిహోర చేశాను. వంట అయింది భోజనాలకి కూర్చున్నాము. ఆయనకి వడ్డిస్తూ చెప్పాను.

"మీకెంతో ఇష్టమని పొంగలి, ఆవపెట్టి పులిహోర చేశాను"

మీ కోసమని అనేసరికి ఆగి నావైపు చూశారు. నేను కంగారుగా "అదే ఈరోజు కృష్ణాష్టమి కదా ఏదో సరదాగా చేశాను. ఇద్దరం ఇంట్లో ఉన్నాం కదా బాగుంటుందని" అన్నాను. లేకపోతే ఆయన మళ్ళీ మొదలు పెడతారు. ప్రశాంతంగా భోజనం చేయడానికి ఉండదు. ఆ మాటతో తృప్తిపడి అంతే తృప్తిగా భోంచేశారు.

ప్రొద్దున నుండి చెబుదామనుకున్న శుభవార్త అలాగే ఉంది. చెప్పడానికి వీలవలేదు. ఈయనగారు పడనిస్తేనా.

నెమ్మదిగా ఆయన దగ్గరికి చేరా.

"ఏమండీ సాయంత్రం అలా సరదాగా తిరిగి వద్దామా? చాలా రోజులయింది మనము బయటికి వెళ్ళి" అన్నాను. బయటికి వెళితేనన్నా ఈ ధోరణి నుండి బయటపడతారని నా ఆలోచన.

నా మాటలు వినిపించుకున్నట్టు లేరు. రెండు సార్లు చెప్పి చూశాను. వినిపించుకోలేదు సరికదా, ఏదో డిస్టర్బ్ చేస్తున్నదానిలాగా విసుగ్గా నావైపు చూశారు. ఇంక నాకు కోపం ఆగలేదు. ప్రొద్దున నుండి అణచుకున్న బాధ, విసుగు బయటపడ్డాయి.

"ఏమిటండీ మీ ధోరణి? ప్రొద్దున నుండి గమనిస్తున్నాను. ఏమీ సాధించలేదు, సాధించలేదు అంటూ నన్ను సాధిస్తున్నారు. ఇంక వేరే ఏమి సాధించాలి. కనీసం ఒక్క చిరునవ్వు నవ్వారా? అయినా మీలాంటి మొగుళ్ళకి పెళ్ళాన్ని సెలవు రోజయినా సుఖపెట్టలేని వారు ఏదో సాధిద్దామని ఏమనుకుంటున్నారు? సెలవు రోజు కదా, హాయిగా కాలక్షేపం చేద్దాము, మీ పుట్టినరోజుకి మంచి శుభవార్త మీకు గిఫ్టిగా ఇద్దామని అనుకుంటుంటే" అంటూ ఆవేశంగా దులిపేసి లోపలికి వెళ్ళాను.

కొంచెం సేపటికి మావారు తేరుకుని నా దగ్గరకు వచ్చారు. నాకోసం అయివుండదు, నేను చెప్పబోయే శుభవార్త కోసమే అయివుంటుంది

"సారీ డియర్ నిన్ను బాధపెట్టాను. నన్ను క్షమించు. ఇంతకూ ఏమిటా శుభవార్త?" అడిగారు.

నేనేమీ సమాధానం చెప్పలేదు.

"ప్లీజ్...ప్లీజ్ చెప్పవూ మ్యాతల్లివిగదా, నా ఫ్రెండ్‌వి గదూ...." బతిమాలడం మొదలుపెట్టారు.

నా ప్రాణానికి ఎంతో హాయిగా ఉంది ఆయని అలా బతిమాలుతుంటే. అలా కొంచెం సేపయిన తరువాత చెప్పాను ఆ శుభవార్త.

"యా హూ..." సంతోషం పట్టలేక అరిచారు. ఆ సంతోషంలో నన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. అలసి అలసి ఆగారు. ఆ తరువాత అడిగారు "ఈ విషయం ముందే చెప్పలేదేం"

ఆయనికి ఇప్పుడు ఏమీ గుర్తుకు రావడం లేదు. ఆయన వయస్సు, సచిన్ బ్యాటింగ్, ఏదో సాధించడం ఏమీ ఏమీ గుర్తుకు రావడం లేదు. ఆయన కళ్ళల్లో వెలుగు, ఆ వెలుగులో ఏదో సాధించాను అనే తృప్తి. ఏదో పెద్ద పదవి లభిస్తున్నంత ఆనందం.

అవునుమరి నేను చెప్పిన శుభవార్త ఏమన్నా చిన్నదా. జీవితంలో మొదటిసారిగా తల్లిదండ్రులమవుతున్నామంటే ఎవరికి ఆనందం కాదు.

●